# కంపెనీ పెట్టేవరకు కష్టమే!

- దావోస్‌లో ఒప్పందాలపై పెదవి విరుస్తున్న నిపుణులు
- నిరుడు రూ.40,232 కోట్ల పెట్టుబడులంటూ ప్రకటన
- 18 కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయన్న ప్రభుత్వం
- ఏడాదిలో ఒక్కటీ పూర్తికాలే.. ఒక్క ఉద్యోగమూ రాలే
- ఈసారి రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలంటూ ప్రచారం
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానం ఉన్నదంటున్న నెటిజన్లు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంటున్నది. రూ.1.78 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని ప్రచారం చేసుకుంటున్నది. అయితే.. గతేడాది కాంగ్రెస్ పాలన అనుభవాల దృష్ట్యా ఈ ఒప్పందాలు అమలవడంపై నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఇందుకు నిరుడు దావోస్ పెట్టుబడులే ఉదాహరణ. నిరుడు జనవరిలో జరిగిన దావోస్ సదస్సుకు సీఎం రేవంత్ బృందం వెళ్లిన సంగతి తెలిసిందే. మొత్తం రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ, ఏడాది గడిచినా అందులో ఏ ఒక్కటీ అమలు కాలేదు, ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు. అంటే వాటిలో ఏ ఒక్క కంపెనీ కూడా ఇప్పటివరకు కార్యకలాపాలు ప్రారంభించలేదన్నమాట. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సైతం చెప్పుకోవడానికి భారీగానే ఉన్నాయని, కానీ ఎప్పుడు అమల్లోకి వస్తాయో ప్రభుత్వమే స్పష్టత ఇస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

**ఎంవోయూ చేసుకుంటే ఇచ్చినట్టు కాదు**

'దావోస్‌లో జరిగే ఎంవోయూలన్నీ.. మీ రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నామని చెప్పడానికి మాత్రమే. ఎంవోయూ చేసుకున్నంత మాత్రాన ఇస్తామని ఎక్కడా లేదు' అని నిరుడు డిసెంబర్ 6న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దీనిని బట్టి ఎంవోయూ చేసుకున్నంత మాత్రాన కంపెనీలు వచ్చినట్టు కాదన్నమాట. కంపెనీలతో తరచూ సంప్రదింపులు జరుపుతూ ఉంటేనే అవి కార్యరూపంలోకి వస్తాయని చెప్తున్నారు. అయితే.. గతేడాది దావోస్‌లో జరిగిన ఎంవోయూల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని, ఉద్యోగాలు కల్పించలేకపోయిందని, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు కలిగిస్తున్నదని పలువురు విమర్శిస్తున్నారు. పైగా ఈ ఏడాది చెప్పుకొంటున్న కంపెనీల్లో స్కైరూట్ (రూ.500 కోట్లు), మేఘా ఇంజినీరింగ్ (రూ.15 వేల కోట్లు), కంట్రోల్ ఎస్ డాటా సెంటర్స్ (రూ.10 వేల కోట్లు) హైదరాబాద్‌కు చెందినవని, ఇక్కడ చేసుకోవాల్సిన ఒప్పందాలను గొప్పల కోసం దావోస్‌లో చేసుకున్నారని విమర్శిస్తున్నారు. జేఎస్‌డబ్ల్యూ వంటివి గతంలోనూ ఒప్పందాలు చేసుకున్నాయని, వాటినే మళ్లీ చేసుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది దావోస్ పెట్టుబడులు కార్యరూపం దాల్చడంపై అనుమానాలున్నాయని నెటిజన్లు చెప్తున్నారు.

**కేసీఆర్ హయాంలో వాస్తవరూపం దాల్చిన ఒప్పందాలు**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రపంచ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమై రాష్ట్రంలో సుమారు రూ.500 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నది. అంతేకాదు, ఒప్పందం ప్రకారం ప్రభుత్వం భూమి కేటాయించడం, కంపెనీ ఏర్పాటు పనులు చకచకా జరిగిపోయాయి. అలాగే, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో కిటెక్స్ సంస్థ సైతం సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడికి రెండేళ్ల క్రితం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని వెంటనే కంపెనీ ఏర్పాటుకు సంబంధించి పనులు ప్రారంభించింది. వచ్చే మార్చిలోగా ఉత్పత్తి ప్రారంభించేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తున్నది. ఇదే కంపెనీ సీతారాంపూర్‌లో సైతం మరో కంపెనీని ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకున్నది. అక్కడ కూడా కంపెనీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. గత కేసీఆర్ ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడమే కాదు, వాటిని వాస్తవరూపం దాల్చే విధంగా కృషిచేసింది.

## రాష్ట్రానికి రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగిసింది. సింగపూర్, దావోస్ పర్యటనలను ముగించుకొని శుక్రవారం ఉదయం ఆయన హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. మూడు రోజులపాటు దావోస్‌లో జరిగిన చర్చల్లో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. 20 కంపెనీలతో అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరినట్టు వెల్లడించింది. వీటి ద్వారా సుమారు 47,550 ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. అమెజాన్ రూ.60 వేల కోట్ల భారీ పెట్టుబడి ప్రకటించగా.. విప్రో, ఇన్ఫోసిస్ కంపెనీలు విస్తరణ ప్రణాళికలు ప్రకటించాయి. సన్ పెట్రో కెమికల్స్ రూ.45,500 కోట్ల పెట్టుబడితో భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుతోపాటు నాగర్‌కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నది. కంట్రోల్ ఎస్ సంస్థ రూ.10 వేల కోట్లతో డాటా సెంటర్ క్లస్టర్, మేఘా ఇంజినీరింగ్ సంస్థ పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లు, టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ డాటా సెంటర్ ఏర్పాటుకు రూ.15,000కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చాయి. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్ హైటెక్ సిటీలో క్యాంపస్ ఏర్పాటుకు, విప్రో గోపన్‌పల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్ ఏర్పాటుకు, ఇన్ఫోసిస్ పోచారం ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి.

## గురుకుల విద్యార్థి ఆత్మహత్య!

- మంచిర్యాల జిల్లా చెన్నూరులో విషాదం

ఆదర్శ్ (ఫైల్)

చెన్నూర్ టౌన్, జనవరి 23 : మంచిర్యాల జిల్లా చెన్నూరు మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మారగోని ఆదర్శ్ (16) అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బీరెల్లికి చెందిన మారగోని ఆదర్శ్ బుధవారం ఉదయం స్వగ్రామం నుంచి పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. కాగా ఆదర్శ్ పాఠశాలకు రాలేదని అదే రోజు సాయంత్రం విద్యార్థి కుటుంబానికి సిబ్బంది సమాచారమిచ్చారు. దీంతో కుటుంబీకులు ఆదర్శ్ కోసం రాత్రి చెన్నూరు పరిసర ప్రాంతాల్లో వెతికారు. గురువారం ఉదయం సమీకృత మార్కెట్ సముదాయ భవనం (ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం)లో ఆదర్శ్ మృతదేహం కనిపించడంతో పోలీసులు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద పురుగులమందు డబ్బా కనిపించడంతో ఆత్మహత్య కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. మృతదేహన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ రవీందర్ సందర్శించారు. ఆదర్శ్ తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

## ఖోఖో ఆడుతూ విద్యార్థి మృతి

రాథోడ్ బన్నీ(ఫైల్)

నార్నూర్, జనవరి 23: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం భీంపూర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థి రాథోడ్ బన్నీ(15) ఖోఖో ఆడుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల వివరాల ప్రకారం.. బన్నీ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. బన్నీ ఖోఖో ఆడుతూ స్పృహ కోల్పోయాడు. అతన్ని నార్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎంఈవో పవార్ అనిత, ట్రెయినీ అఖిల్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, జాదవ్ రేణుక డిమాండ్ చేశారు.

## పోలీస్ వేధింపుల భయం

మొదటిపేజీ తరువాయి...

ఆయా ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి ఎదురుగా అద్దెకు ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున భర్త బాజీని ఓ కేసు విషయమై ఖమ్మం పోలీసులు తీసుకెళ్లారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఫేజా తన ఇద్దరు కూతుళ్లకు ఉరివేసి, ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడింది. రోజూ తమ ఇంటికి వచ్చే పిల్లలు రాకపోవడంతో షేక్‌బాజీ తల్లి అక్కడికి వెళ్లింది. తలుపులు వేసి ఉండడంతో కిటికీలోంచి చూడగా.. కోడలు ఫేజా, పిల్లలు ఉరివేసుకుని విగతజీవులుగా కనిపించారు. భర్తను పోలీసులు తీసుకెళ్లారనే అవమానంతో ఫేజా తన పిల్లలకు ఉరివేసి ఆత్మహత్యకు పాల్పడిందని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను మధిర ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ఫైనాన్సర్ వేధింపులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

మల్కాజిగిరి, జనవరి 23 : ఫైనాన్సర్ వేధింపులతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాలు.. యాదమ్మనగర్‌కు చెందిన కురుమయ్యకు(55) భార్య ఎల్లమ్మతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది కిందట అతను ఫైనాన్సర్ వద్ద ఆటో కొనుగోలు చేశాడు. నెలవారి కిస్తీలు కట్టకపోవడంతో నెల క్రితం ఫైనాన్సర్ ఆటోను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో డబ్బులు కట్టాలని ఫైనాన్సర్ వేధింపులు ఎక్కువకావడంతో గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ దవాఖానకు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## కాంగ్రెస్ నేత దురాగతం.. స్నేహితుడి భార్య కిడ్నాప్!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నాడు. ఎండ్ల శ్రీకాంత్ గత ఆగస్టులో డెంగ్యూతో మృతి చెందాడు. శ్రీకాంత్‌కు పెండ్లి సమయంలో రాధిక తల్లిదండ్రులు ఎకరం భూమి ఇచ్చారు. తిమ్మాపూర్‌కు చెందిన వస్పుల మహేందర్ కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల ఉపాధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు. వస్పుల మహేందర్, ఎండ్ల శ్రీకాంత్ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. శ్రీకాంత్ చనిపోవడంతో రాధిక పేరుపై ఉన్న ఎకరం భూమిపై మహేందర్ కన్నేశాడు. శ్రీకాంత్ రియల్ ఎస్టేట్‌లో ఎక్కడెక్కడ డబ్బులు ఇన్వెస్ట్ చేశాడో చెబుతానని ఈ నెల 20న పట్టా పాస్‌బుక్ తీసుకొని రమ్మని రాధికతో నమ్మబలికాడు. అమె మహేందర్ దగ్గరకు వెళ్లడంతో బలవంతంగా కారులో ఎక్కించుకుని తిరుపతి రూట్‌లో బయలుదేరారు. దారిలో రాధికను కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న బంగారు ఉంగరం, డబ్బులు తీసుకున్నాడు. ఖాళీ బాండ్లపై సంతకాలు చేయాలని, లేకపోతే కుమారుడిని కూడా చంపేస్తామని బెదిరించారు. ఈ క్రమంలో మహేందర్, డ్రైవర్ మార్గమధ్యంలో కారు ఆపి మద్యం సేవించారు. వారు మద్యం మత్తులో ఉండగా అక్కడి నుంచి రాధిక తప్పించుకొని కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి మహేందర్‌పై ఫిర్యాదు చేసింది. సీఐ నరసింహారావు టీంను ఏర్పాటు చేసి మహేందర్, డ్రైవర్ శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కత్తి, కారు, రెండు సెల్‌ఫోన్లు, ఉంగరం, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎండ్ల శ్రీకాంత్ తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు మహేందర్, శేఖర్‌ను రిమాండ్‌కు తరలించారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు మహిపాల్, రవికుమార్, హోంగార్డ్ నగేశ్‌ను సీఐ అభినందించారు.

కాంగ్రెస్ నేత మహేందర్

## వేసవిలో రెప్పపాటు కరెంటు పోవద్దు

- సీఎండీ నుంచి ఎస్ఈల వరకు నిరంతరం పర్యవేక్షించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 23 (నమస్తేతెలంగాణ): వేసవిలో విద్యుత్తు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌కో సీఎండీ నుంచి ఎస్ఈలకు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజాభవన్‌లో ఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో రెప్పపాటు కూడా కరెంట్ అంతరాయం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. పీక్ డిమాండ్‌ను తట్టుకునేలా ట్రాన్స్‌మిషన్ సిస్టంను బలోపేతం చేయాలని తెలిపారు.

## స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ ఆఫీసులో అక్రమాలు!

- ఏసీబీకి సర్పంచుల జేఏసీ ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తేతెలంగాణ): స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ ఆఫీసులో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ సర్పంచుల జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని ఏసీబీ డీజీకి ఫిర్యాదు చేశారు. తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట జేఏసీ ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, నాయకులు శంకర్ ఉన్నారు.

## హెచ్‌సీయూ పీజీ అడ్మిషన్లపై నేడు టీ-శాట్ లైవ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పీజీ అడ్మిషన్ల గురించి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని టీ-శాట్ సీఈవో బీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీలోని కోర్సులు, ఏఏ భాషలు, ఎన్ని విభాగాల్లో అడ్మిషన్లు తదితర విషయాలను వివరించనున్నామని చెప్పారు. ఇదే కార్యక్రమం శనివారం సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్య చానల్‌లో ప్రసారమవుతుందని చెప్పారు.

## 50 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

హైదరాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్ సాగు 50 లక్షల ఎకరాలకు చేరింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 49.66 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇందులో అత్యధికంగా వరి 36.21 లక్షల ఎకరాల్లో సాగైనట్లు పేర్కొంది. ఆ తర్వాత 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.5 లక్షల ఎకరాల్లో జొన్న పంట సాగైంది. గత ఏడాది ఈ సమయం వరకు మొత్తం పంటల సాగు 37.85 లక్షల ఎకరాలు. గత ఏడాదితో పోల్చితే సుమారు 12 లక్షల ఎకరాల్లో అధికంగా సాగు కావడం గమనార్హం. వరి సాగు కూడా గతంతో పోల్చితే 9.5 లక్షల ఎకరాల్లో అధికంగా సాగైంది.

## ఫిబ్రవరిలో రైతులకు సబ్సిడీ యంత్రాలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా టెండర్లు ఆహ్వానించింది. దరఖాస్తుకు ఫిబ్రవరి 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇందులో మొత్తం 20 పరికరాలను వ్యవసాయ శాఖ పంపిణీ చేయనుంది. ముఖ్యంగా 600 ట్రాక్టర్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీంతో పాటు 12వేల రోటవేటర్స్, 12వేల స్ప్రేయర్స్, 160 డ్రోన్లు, 4వేల కల్టివేటర్స్, 600 సీడ్ డ్రిల్స్, 6వేల కేజ్‌వీల్స్‌తో పాటు ఇతర పరికరాలను పంపిణీ చేయనుంది.

## కానిస్టేబుళ్లకు తొలి జీతమెప్పుడో!

- కొలువులో చేరి రెండు నెలలైనా ఎదురుచూపులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు తొలి వేతనం కోసం రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు. సివిల్, ఏఆర్, ఐటీఅండ్‌సీ, పీటీవో, బెటాలియన్ కలిపి 12 వేల మంది విధుల్లోకి చేరారు. గత నవంబర్‌లో శిక్షణ తర్వాత డ్యూటీ అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్నవారికి కూడా వేతనం రాలేదు. కామారెడ్డి, సంగారెడ్డితో పాటు కొన్ని జిల్లాల్లో పోస్టింగ్ తీసుకున్న వాళ్లలో కొందరికి మాత్రమే వేతనాలు అందినట్టు సమాచారం. మిగతా జిల్లాల్లోని 10వేల మంది కానిస్టేబుళ్లు వేతనం కోసం నిరీక్షిస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేది ఎప్పుడో?

- 16 వేలకు పైగా కుటుంబాల ఎదురుచూపు
- గ్రాట్యుటీ, సీసీఎస్, ఆర్జిత సెలవుల ప్రయోజనాల చెల్లింపులో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న కార్మిక సంఘాల నేతలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : సాధారణంగా ఆర్టీసీలో ఉద్యోగులకు ఉద్యోగ విరమణ పొందిన రోజే ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ఆనవాయితీ. కానీ, ఇది గతంగా మారిందని రిటైర్డ్ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 16 వేల మందికిపైగా ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. వీరు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన కొద్ది రోజుల్లోనే గ్రాట్యుటీ మొత్తం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికీ ఎదురుచూపులు తప్పడం లేదు. 2022 ఏప్రిల్ వరకు ఎప్పటికప్పుడు బెనిఫిట్స్ అందించడంతోపాటు 2024 జనవరి వరకు గ్రాట్యుటీ కూడా చెల్లించారు. ఇక ఫిబ్రవరి నుంచి బ్రేక్ పడింది. ఆ నెలలో రిటైర్ అయిన వారికి నెల ఆలస్యంగా చెల్లించారు. ఏప్రిల్ నుంచి పదవీ విరమణ పొందుతున్న వారికి ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. కనీసం బస్‌భవన్‌లోనూ ఇందుకు సంబంధించిన సమాచారం లేదని వాపోతున్నారు.

**భవిష్యత్తు కార్యాచరణ గందరగోళం..**

సాధారణంగా రిటైర్మెంట్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అనేవి ముఖ్యం. వీటితో భవిష్యత్తు కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. కానీ, ఆ మొత్తం చేతికందకపోవటంతో గందరగోళానికి గురవుతున్నారు. డ్రైవర్, కండక్టర్ లాంటి వారికి దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు, ఈడీ లాంటి పెద్ద పోస్టు అధికారులకు రూ.60 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

**బాండ్ల డబ్బులూ రాకపాయే..**

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఉద్యోగులకు పెండింగ్ బాండ్ల డబ్బులు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదు. ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.లక్షననర వరకు అందాల్సి ఉన్నది. దాదాపు 1500 మంది రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగకాలంలో పోగైన 300 ఆర్జిత సెలవుల(ఈఎల్స్)ఎన్‌క్యాష్‌మెంట్ ఉంటుంది. ఆ సెలవులకు సంబంధించి నగదు చెల్లిస్తారు. అవి కూడా ఆగిపోయాయి. బెనిఫిట్స్ చెల్లింపుల్లో ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు థామస్‌రెడ్డి, యాదయ్య, కమాల్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## 27న బస్‌భవన్‌కు తరలిరావాలి

- కార్మికులకు టీజీఎస్ ఆర్టీసీ జాక్ పిలుపు
- ఎలక్ట్రిక్ బస్సులపై తప్పుడు సమాచారం
- కార్మిక సంఘాలతో బహిరంగచర్చ పెట్టాలి
- ఆర్టీసీ జాక్ రాష్ట్ర ప్రతినిధుల బృందం ధ్వజం

హైదరాబాద్, జనవరి 23 (నమస్తేతెలంగాణ): ఈ నెల 27న ఆర్టీసీ కార్మికులు హైదరాబాద్ బస్‌భవన్‌కు తరలిరావాలని టీజీఎస్ ఆర్టీసీ జాక్ రాష్ట్ర ప్రతినిధులు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో గురువారం ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈ వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, బీయాదగిరి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల డిమాండ్ల సాధనకై ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బస్‌భవన్ ఎదుట హాజరైన కార్మికులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని, అనంతరం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సమ్మె నోటీస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సులపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నదని, వాస్తవాలు తెలియాలంటే కార్మిక సంఘాలతో బహిరంగ చర్చ పెట్టాలని వారు డిమాండ్ చేశారు. వాటి రాకతో ఆర్టీసీ ఉద్యోగాలు కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం ఇచ్చిన వివరణ పచ్చి బూటకమని పేర్కొన్నారు.

**ఆర్టీసీ ఎండీని తప్పించి విచారించాలి: ఎన్‌ఎంయూ అధ్యక్షుడు కమాల్‌రెడ్డి**

టీజీఎస్‌ఆర్టీసీలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులు, ఇతర సమస్యలపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌పై విచారణ జరిపిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కమాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అధికారులు బయటకు చెప్పే విషయాలు ఒక విధంగా ఉంటే, వాస్తవాలు వాటికి భిన్నంగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్టీసీ లాభాల్లో నడుస్తుందని చెప్పుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. పెండింగ్ బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. 2017 నుంచి రిటైర్డ్ కార్మికులకు ఒక రూపాయి ఇప్పటికీ ఇవ్వలేదని పేర్కొన్నారు. కానీ ఎండీ సజ్జనార్ మాత్రం మరోలా చెప్తున్నారని విమర్శించారు. ఆర్టీసీలో పోలీస్ అధికారి మాదిరిగా వ్యవహరిస్తూ కార్మికుల న్యాయమైన హక్కులను కాలరాస్తూ, ఆర్టీసీ ఉద్యోగులను వేధిస్తున్నారని కమాల్‌రెడ్డి విమర్శించారు.

# కిడ్నీ రాకెట్‌కు కార్పొరేట్ లింకులు?

- బడా దవాఖానలపై పోలీసుల అనుమానాలు
- పోలీసుల అదుపులో దళారులు, వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని అలకనంద దవాఖానలో బయటపడ్డ కిడ్నీ మార్పిడి మాఫియాకు కార్పొరేట్‌కు లింకులున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దవాఖానలో కిడ్నీలు మార్చేందుకు కావాల్సిన పూర్తి సౌకర్యాలు లేకపోవడంతో, దవాఖాన వెనుక ఏవైనా కార్పొరేట్ దవాఖానలు ఉన్నాయా అని పోలీసులు, వైద్య విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, విజయవాడ దవాఖానాల హస్తంపైనా ఆరా తీస్తున్నారు. కిడ్నీ మార్పిడి దందాలో దళారులుగా వ్యవహరిస్తున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నీలు మార్చిన నెఫ్రాలజిస్ట్, అనస్తీషియా వైద్యులను గుర్తించారు. దళారులలో కొందరికి చాలాకాలంగా మాఫియాతో లింకులున్నట్టు పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. కిడ్నీ మార్పిడి మాఫియాతో సంబంధాలున్న బెంగళూర్‌కు చెందిన ఓ వైద్యుడిని కూడా అదుపులోకి తీసుకుంటున్నట్టు తెలిసింది.

**దవాఖాన నిర్లక్ష్యానికి మహిళ మృతి!**

చౌటుప్పల్‌కు చెందిన ఓ మహిళ కిడ్నీలో రాళ్ల సమస్యతో ఇటీవల అలకనంద దవాఖానలో చేరింది. దవాఖానలో చికిత్స పొందుతూ జనవరి 2న చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యమే మృతికి కారణమంటూ మహిళ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దవాఖాన నిర్వాహకులు లక్షల రూపాయలు ముట్టజెప్పి రాజీ కుదుర్చుకున్నట్టు తెలుస్తున్నది. రాజీ వ్యవహారంలో స్థానిక రాజకీయనేతల ప్రమేయం కూడా ఉందని సమాచారం. దవాఖాన వద్ద గొడవ జరిగినా పోలీసులు, వైద్యాధికారులు ఎందుకు పట్టించుకోలేదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## త్వరలో మరో 286 ఎలక్ట్రికల్ బస్సులు

- మే నాటికి డిమాండ్ ఉన్న మార్గాల్లో అందుబాటులోకి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : టీజీఎస్‌ఆర్టీసీ ఈ సంవత్సరం ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో మరో 286 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. మే నాటికి డిమాండ్ ఉన్న మార్గాల్లో ఈ బస్సులను అందుబాటులోకి తేనున్నది. ప్రస్తుతం నగరంలో సగటున 80 శాతం ఆక్యుపెన్సీతో 254 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. దశలవారీగా డీజిల్ బస్సుల సంఖ్యను తగ్గించి 2,500 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆర్టీసీ.. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నది.

**రాణిగంజ్ డిపోలో ఈవీ చార్జింగ్ స్టేషన్..**

వచ్చే మూడు నెలల్లో రాణిగంజ్ డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఈవీ చార్జింగ్ పాయింట్‌ను ప్రారంభించి అక్కడి నుంచి సుమారు 100 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. కూకట్‌పల్లి బస్ డిపో నుంచి మరో 100 ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా, ప్రస్తుతం నగరంలో 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు, 74 ఎలక్ట్రిక్ సిటీ ఆర్డినరీ, 90 ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

## ఎస్పీఎఫ్ అభాసుపాలు

- సెక్రటేరియట్‌లో సిబ్బంది అత్యుత్సాహం!
- సచివాలయ భద్రతపై సీనియర్ ఐపీఎస్ ఆగ్రహం
- వివాదాస్పదంగా ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): సిబ్బంది తీరుతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం అభాసుపాలవుతున్నది. సచివాలయంలో భద్రతా విధులు నిర్వర్తిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది వరుస వివాదాల్లో చిక్కుకుంటూ చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఓ ఎమ్మెల్యేను గుర్తుపట్టకుండా అడ్డుకున్న ఘటన మరువకముందే.. మొన్న సచివాలయంలోకి వెళ్లే విలేకరులను అడ్డుకొని నానా యాగీ చేశారు. తాజాగా గురువారం వీవీఐపీ లిఫ్ట్‌లో వెళ్తూ సీనియర్ ఐపీఎస్ అధికారి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో సిబ్బందిపై ఆ అధికారి ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీరు డ్యూటీ పర్పస్ వెళ్తున్నారా' అని ఆరా తీశారు. దీంతో కంగుతున్న సిబ్బంది లిఫ్ట్ దిగి వెనక్కి వెళ్లే ప్రయత్నం చేయగా, పేర్లు, పీసీ నంబర్ అడగటంతో విజిటర్స్ వెనక్కి వెళ్లి దాక్కునే ప్రయత్నం చేశారు. వెంటనే వారిని పిలిచి 'మీ ఆఫీసర్‌కి చెప్పాలా? ఇదేనా డ్యూటీ చేసే పద్ధతి?'.. 'డోంట్ యూజ్ వీవీఐపీ లిఫ్ట్ ఫర్ యువర్ పర్సనల్ వర్క్స్' అంటూ ఘాటుగా మందలించి వెళ్లిపోయారు.

## స్కిల్ యూనివర్సిటీలో ప్రవేశాలు

- ఈ నెల 30 వరకు అవకాశం

హైదరాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ): యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నాలుగు కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఎండోస్కోపీ టెక్నీషియన్(ఏఐజీ దవాఖాన) ఈక్యూయుఐపీపీ బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ కన్సార్షియం), సప్లయ్ చైన్ ఎసెన్షియల్స్ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం(ఓ9 సొల్యూషన్స్), మెడికల్ కోడింగ్ స్పెషలిస్ట్(కిమ్స్ దవాఖాన) కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. ఈ నెల 30న ప్రవేశాల ప్రక్రియ ముగియనున్నదని, ఫిబ్రవరి మొదటి వారం నుంచి శిక్షణ ప్రారంభంకానున్నట్టు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

## యూట్యూబర్ రాజ్‌కుమార్‌కు బెయిల్

దేవరుప్పుల, జనవరి 23: యూట్యూబర్ భూక్యా రాజ్‌కుమార్‌కు బెయిల్ మంజూరైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా ద్వారా యూట్యూబ్‌లో కథనాలను ప్రసారం చేశాడంటూ పాలకుర్తి పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేయగా 12వ తేదీన జైలుకు పంపారు. కాగా కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో గురువారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. కాగా దేవరుప్పులకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ధరావత్ రాంసింగ్, చింత రవి, జోగు సోమనర్సయ్య, వంగ అర్జున్ జనగామ జైలు వద్ద రాజ్‌కుమార్‌కు స్వాగతం పలికారు.

జనగామ జైలు వద్ద రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు